# వివశులు

"బుద్ధి లేకపోతే సరి, ఏళ్ళొచ్చాయి ఎందుకు?" అంది వసుధ కోపంగా.

"అంత కానిపనేముందే నేను చేసింది!" అంది సుందరమ్మ కుదించుకుపోతూ.

"చేతిలో పైసా ఉండనివ్వవు. వస్తువుల మీద వ్యామోహం. ఆ స్టీలు బిందెకు నా చీరె వేసింది కాక ఇంకా పాతిక రూపాయలు వాడి చేతబెట్టావా?"

"నా చీరెలు వేస్తే తీసుకోనన్నాడు. మరీ పాత చీరలు - చిరిగినవి తీసుకోనన్నాడు."

"ఏం ఇప్పుడు మనకా స్టీలు బిందె లేకపోతే చచ్చిపోతామా?"

"కింద నుంచి మంచినీళ్ళు తేవటం నీకే ఇబ్బందిగా ఉంటున్నదని తీసుకున్నాను."

"మరి మాట్లాడక. చేసిన తప్పుడు పనికి సమర్థింపు కూడాను."

సుందరమ్మ మెల్లగా లేచి గదిదాటి వచ్చి బయట బాల్కనీలో నిలబడింది. నడి శీతాకాలం. సాయంత్రం ఆరు గంటలకే చలివేస్తోంది. ఆమెకు కూతురు ఎదుట ఉండటం భయమేసింది. ఆ ఒక్క గది ఇంటిలో మరి మార్గంలేదు. చలికి పమిట భుజాల చుట్టూ కప్పుకుంటూ బాల్కనీ గోడ నానుకు కూర్చుంది సుందరమ్మ.

ఇరవై ఐదు కాండిల్ పలచటి దీపకాంతి బాల్కనీలో పడుతోంది. పక్కింటి పిల్లవాడు తల్లి కొడితే ఏడుస్తున్నాడు. కిలో గోధుమపిండి తీసుకురమ్మని తల్లి పంపితే, అందులో అర్ధరూపాయి పెట్టి చాక్లెట్ కొనుక్కున్నందుకు తల్లి వాడిని కొట్టింది. ఆ పక్క ఇంటిలో ఉండే అరవ యువకుడు చీరలమూటను పట్టుకుని పైకి వచ్చాడు. రంగస్వామి వెళ్ళిపోయాక అతనాగదిలో చేరాడు. సుందరమ్మ పక్కకు తప్పుకుని అతనికి దారి ఇచ్చింది. ఇళ్ళంటే కనీసం రెండు గదులయినా ఉంటాయని అనుకోకండి. అన్నీ ఒక రూం టెనమెంట్లు. అలాంటివి ఆరున్నాయి. ఇంటి యజమాని మార్వాడి. ఎప్పుడో తాతలు కట్టిన ఇంటిని కూల్చడం ఇష్టంలేక ఇలాంటి చాలీచాలని బతుకుల మనుషులకు అద్దె కిస్తూంటాడు. సున్నంతో కట్టిన గదులు, ప్లాస్టర్ రాలిపోయి, కాల్పనికత కించిన్మాత్రం ఉన్న వ్యక్తులకు కూడా ఎన్నో చిత్రాలను దృశింపచేస్తూ ఉంటాయి. ఒక్కో గదికి కిరాయి మూడు వందలు. అద్దెకున్న వాళ్ళకు మార్వాడీ కలిగించే సౌకర్యం ఒక్కటే. బోరు నీళ్ళు పైకి వచ్చేట్టు పంపులు పెట్టాడు. మంచినీళ్ళు మాత్రం కిందనుంచి తెచ్చుకోవాలి.

సుందరమ్మకు నిస్త్రాణగా ఉంది. వంట చెయ్యాలి. కూతురు ఆఫీసులో పనిచేసి అలసిపోయి వచ్చింది. ఆకలేస్తోందేమో? అయినా ఆమె లేవలేక అక్కడే కూర్చుండి పోయింది.

సుందరమ్మ చేసిన తప్పల్లా పాత గుడ్డలు తీసుకుని స్టీలు సామానులమ్మే వాడికి వసుధ చీరె వేయటం. తన చీరెలు కూడా రెండు వేసింది. ఆ సంగతి తెలిస్తే కూతురు మండిపడుతుంది. అందుకే సుందరమ్మ చెప్పలేదు. మూడు చీరెలూ తీసుకుని కూడా

యాభై రూపాయలు అదనంగా ఇవ్వమన్నాడు. చివరకు పాతిక రూపాయలకు బేరం కుదిరేసరికి ఆమె పులకమారింది. బిందె చక్కగా ఉంది. దాని మీద వ్యామోహం చంపుకోలేక పోయింది సుందరమ్మ. కూతురు ఇంటి ఖర్చులకోసం ఇచ్చిన డబ్బులో మిగిలిన పాతిక రూపాయలూ ఇచ్చి, కూతురు ఏమంటుందోనని భయపడుతూనే, బిందె తీసుకుంది ఆమె. 'పాపం, అది కింది నుండి పంపు నీళ్ళు పైకి మోసుకు రావటానికి ఇబ్బంది పడుతోంది. రెండు గిన్నెల్లో తెచ్చి కుండలో పోస్తోంది. కుండ నిండటానికి నాలుగుసార్లు కిందకీ పైకీ తిరగాల్సి వస్తోంది. బిందే ఉంటే రెండుసార్లు తిరిగితే సరిపోతుంది' అనుకుంది ఆమె. తనకు కింద నుంచి నీళ్ళు తీసుకొచ్చే ఓపికలేదు. మోకాళ్ళు పట్టేస్తాయి. నీళ్ళు మోసుకుని పైకి వచ్చేటప్పటికి ఆయాసం వస్తుంది. అందువల్ల మంచినీళ్ళు తీసుకు రావటం వసుధకు తప్పటం లేదు. అది ఒక కారణమయితే, స్టీలు బిందెను చూసిన తర్వాత దాన్ని వదల బుద్ధి కాకపోవటం మరో కారణం. అందుకే, కూతురు "నీకు వస్తువుల మీద వ్యామోహం" అన్నా ఆమె తను చేసిన పనిని సమర్థించుకోలేకపోయింది. ఫస్టుతారీకు ఇంకా పదిహేను రోజులుంది. మళ్ళీ జీతమొచ్చే దాకా ఆ డబ్బు కూరలకు వస్తుంది కదా అనుకున్న వసుధకు తల్లి చేసిన పని చూసి మండిపోయింది.

వసుధ తండ్రి శీతారామయ్య ఆమె నెలల పిల్లగా ఉన్నప్పుడు యాక్సిడెంటులో పోయాడు. ఆయనతో సుందరమ్మ కాపురం చేసింది ఐదేళ్ళే. ఓ ప్రయివేటు కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేశాడతను. అతని జీతం కనీసావసరాలకు కూడా సరిపోయేది కాదు. అప్పుడు భర్త సంపాదనకు వేన్నీళ్ళకు చన్నీళ్ళన్నట్లు మొదలుపెట్టిన టైలరింగ్ భర్త పోయాక అదే జీవనాధారమయింది. తల్లిదండ్రులు పోయాక, పెంచిన మేనమామ ఆమెకు పెళ్ళిచేసి చేతులు దులుపుకున్నాడు. శీతారామయ్య తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. అతనికి చదువు సంధ్యలబ్బలేదు. వయసొచ్చినా సంపాదించే ఆలోచన లేని శీతారామయ్యని ఓసారి తండ్రి తిట్టాడు. ఆ కోపంతో ఇల్లువదలి వచ్చిన శీతారామయ్యకు వసుధ మేనమామ ఎలక్ట్రీషియన్ పని నేర్పించి, మేనగోడల్నిచ్చి పెళ్ళి చేశాడు. కొడుకు పోయాక అతని తల్లిదండ్రులు కోడల్నీ, మనుమరాలినీ పట్టించుకోలేదు. కనుక ముప్పయ్యేళ్ళ వయసులో విధవరాలయిన సుందరమ్మకు తన బతుకు తాను బతకాల్సిన అవసరం ఏర్పడింది. వానాకాలం చదువు చదువుకున్న ఆమెకు ఉద్యోగాలేం వస్తాయి! అందుకే టైలరింగ్ పని చేసుకుంటూ జీవనాన్ని సాగించింది. స్కూలు ఫీజులుండవు కనుక గవర్నమెంట్ స్కూల్లో వసుధకు ఎస్సెస్సీ దాకా చదువు చెప్పించగలిగింది. కానీ పెళ్ళి చేయటం ఆమె తాహతుకు మించిన పనయింది.

సుందరమ్మ ఏ పని చేసినా అందంగా చేసేది. కళాత్మకంగా చేసేది. అందుకే ఒకసారి ఆమెచేత బట్టలు కుట్టించుకున్న మహిళలు ఆమెని వదిలేవాళ్ళు కారు. ఆ కళాత్మక ఆరాటం ఆమె చేసే అన్ని పనుల్లోనూ దృశించేది. ఇల్లు శుభ్రంగా ఉంచేది. మడికట్టుకుని వంట చేసేది. దేవుడి పూజ చేసేది. దీపం వెలిగించి దేవుడి ముందు పెట్టినప్పుడు ఆమెకెంతో ఆనందం కలిగేది. కానీ, నూనె ఖర్చవుతుందని కొద్దిగానే నూనె వేసేది ప్రమిదలో. దేవుడి

పూజలో భక్తి స్పృహ ఉండేది కాదు. ఆ పనిలో ఓ అందం ద్యోతకమయ్యేది ఆమెకు. వస్తువులపై వ్యామోహం కాదు. అందమైన వాటిపట్ల ఆమెకున్న గాఢవాంఛ అది. అది ఓ ఆరాటం. కానీ, ఆ విషయం ఆమెకు తెలీదు. అందుకే కూతురు తనకు వస్తువులపై వ్యామోహం అని నిందించినందుకు ఆమె జవాబు చెప్పలేకపోయింది.

వస్తుతః వసుధ తెలివిగల పిల్ల. తల్లి పరిస్థితిని అర్థం చేసుకుంది. వీళ్ళనీ వాళ్ళనీ పట్టుకుని ఓ చిట్‌ఫండ్ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకోగలిగింది. వెయ్యి రూపాయల జీతంతో మొదలైన ఆమె ఉద్యోగ జీవితం అంతకంటే పెద్దగా పైకెదగలేదు. కూతురికి ఉద్యోగం వచ్చాక ఆమె మిషను మీద పని చేయటం పూర్తిగా మానెయ్యలేదు కానీ తగ్గించింది. ఇదివరకటి ఓపిక ఆమెకు లేదు. ఉన్నంతలో సుఖపడసాగింది. కూతురి పెళ్ళికి తనయితే ఏ ప్రయత్నమూ చెయ్యలేదు కానీ, ఆమె పెళ్ళయి వెళ్ళిపోతే తనెలా బతకాలన్న ఆలోచన అంతస్సులో ఎక్కడో ఆమెని బాధపెట్టేది. కూతురి పెళ్ళయి, హాయిగా కాపురం చేసుకోటం కంటే తనకు కావల్సిందేం లేదు. కానీ, ఎందుకో అది జరిగే పనికాదని ఆమె కనిపించేది. నిజానికి అది ఆమె వైయక్తిక ఆకాంక్ష కాదు. మనిషి ఒంటరి వాడు కనుక, సమాజంలో సభ్యుడు కనుక సామాజిక నీతి సమాజంలోని సభ్యులందరి మనస్తత్వం పైన బలీయంగా పనిచేస్తూ ఉంటుంది. ఉన్న సామాజిక నీతి, సంప్రదాయాలను గుర్తించి ఆలోచించి నిర్ణయించుకోగలిగిన చైతన్యం, చదువు ఆమెకు లేవు. ఆడపిల్లకు పెళ్ళి అనేది సమాజంలో స్థిరపడిన భావన. పెళ్ళి కాకపోవటం, చేయలేకపోవటం తల్లికీ, పిల్లకీ అవమాన కారణాలే. నిజానికి సుందరమ్మ కూతురికి పెళ్ళయి వెళ్ళిపోతే ఎలా అని అనవసరంగా మధనపడింది కానీ, వర్ణాలు, కులాలుగా విభజితమై ఉన్న సమాజంలో ఆర్థికంగా, సాంఘికంగా ఎలాంటి అంతస్తూ లేని వసుధకు పెళ్ళి కావడం తేలికైన విషయం కాదని ఆమెకూ తెలుసు. అయితే, స్టేకులున్నాయి. వాటితో ప్రమాదం ఉంది. అలాంటి ప్రమాద పరిస్థితి ఒకటి దాపురించింది.

వసుధ పని చేసే చిట్‌ఫండ్ కంపెనీలోనే ఓ యువకుడు వసుధను పెళ్ళి చేసుకోటానికి ముందుకొచ్చాడు. "మీ అమ్మగారికీ, మీకూ ఇష్టమయితే మనం పెళ్ళిచేసుకుందాం" అన్నాడు.

నల్లగా, లావుగా ఉండే అతను సుందరమ్మ కళాత్మక హృదయానికి నచ్చలేదు. కూతురి పెళ్ళయితే ఎలా అన్న ప్రశ్న ఉండనే ఉంది. "మన కులంవాడు కాదు. ఈ పెళ్ళికి నేను సుతరామూ అంగీకరించను" అంది ఆమె.

వసుధకూ అతను నచ్చలేదు. నచ్చకపోవడమంటే వ్యక్తిగా కాదు. అందమైన వాడు కాదనీ కాదు. మనిషిగా అతను మంచివాడు. నలుగురికి సాయం చేయాలన్న మనస్తత్వం ఉన్నవాడు. అయితే, అతని ఆర్థికస్థితి తన ఆర్థికస్థితి కంటే మెరుగయినదేం కాదు. అది బాగుపర్చుకునే తెలివితేటలున్న మనిషిగా కూడా అతను ఆమెకు కనిపించలేదు. అందుకే "మా అమ్మ మన పెళ్ళికి అంగీకరించటం లేదు. మన కులాలు ఒకటి కావు" అన్నది.

"మీ అమ్మ సంగతలా వదిలెయ్యి. నీకూ ఆ అభ్యంతరముందా?" అని అడిగాడతను.

"కులాలు మనం నిర్మించినవా. కాదనటానికి?"

ఆమెకు దారిద్ర్యం చిరపరిచితం. తండ్రి బతికున్నప్పుడూ, పోయాకా తాము గొప్పగా బతికింది లేదు. జీవితంలో కావాల్సిన వస్తువులన్నీ ఆమెకు షాపు విండోల్లోనూ, వాటి ధరలు ఆకాశంలోనూ కన్పించేవి. వాటిని భూమ్మీద కనిపించేట్టు చేయటం అతనివల్ల కాదు.

ఇది ఫెయిలయిన కొంతకాలానికి మరో పెళ్ళి సంబంధం వచ్చింది వసుధకు. అతను రెండో పెళ్ళివాడు. కులంవాడే. సుందరమ్మకు అతని ఇల్లు నచ్చింది. అతని డబ్బు నచ్చింది. అందుకే పెళ్ళికొడుకు నచ్చకపోయినా మనసుకు సమాధానం చెప్పుకునే ప్రయత్నం చేసింది. ఆమె మధ్యవర్తితో మాట్లాడింది.

"పెళ్ళయ్యాక నా కూతురు ఉద్యోగం చెయ్యదు. అది తప్ప నాకూ ఎవరూ లేరు. కనుక నేనూ దానితోపాటే అల్లుడి ఇంట్లో ఉండాల్సి ఉంటుంది. అది ఆయనకు అంగీకారమయితే నేను వసుధను ఒప్పిస్తాను" అంది.

అందుకు మధ్యవర్తి "అది ఆయనకు తెల్సిందే. ఆయనకు డబ్బుకు కొదువలేదు. మీ పిల్ల ఉద్యోగం చెయ్యాల్సిన పనిలేదు. మీరు ఆమెతో ఉండొచ్చు" అన్నాడు.

వసుధ మనసు ఈ సంబంధాన్ని అంగీకరించడానికి ఊగిసలాడింది. కాని తన స్నేహితురాళ్ళు, పరిచయస్థులు, తోటి ఉద్యోగస్థులు ఏమనుకుంటారు. అయినా, యాభై ఏళ్ళు పైబడిన వాడిని కట్టుకుని తను బావుకునేదేముంది! శారీరక సుఖం లేకపోగా, రోగం వస్తే ఆ వ్యక్తికి చాకిరీ చేయటంతోనే తన జీవితం తెల్లవారుతుంది. అందుకు వసుధ మనసు అంగీకరించలేకపోయింది. సుందరమ్మ కూడా తృప్తిగా నిట్టూర్చింది, తన వయసు అల్లుడు తనకు తప్పాడని.

ఆ తర్వాత ఆమెకు సంబంధాలేవీ రాలేదు. వసుధ అందంగానే ఉంటుంది. కానీ అందాన్ని కొరుక్కుతినరు కదా! అందానికి డబ్బు తోడుండాలి. అదిలేకే వసుధ ముప్ఫయ్యేళ్ళ వృద్ధ కన్యగా మిగిలిపోయింది. కానీ వయసు చేసే ఆరాటం భరించలేకపోయింది ఆమె. తన ఇంటి పక్కన ఉంటున్న రంగస్వామి మొదలియార్ బాల్కనీలో పోతూ ఆమె వంక చూపులు బరపేవాడు. అతను బట్టల మూట నెత్తిన పెట్టుకుని ఇంటింటికీ తిరిగి చీరలు అమ్మేవాడు. తమిళనాడు నుంచి చీరెలు వచ్చేవి. ఖాతాలు సంపాదించుకుని వ్యాపారం చేసేవాడు. పెళ్ళాం బిడ్డలు తంజావూరులో ఉండేవాళ్ళు. ఎప్పుడో ఏడాదికొక్క సారి గానీ అతను అక్కడకు వెళ్ళేవాడు కాదు. డబ్బు పంపేవాడు. హైదరాబాద్‌లో సంసారం పెట్టడం అతనికి తలకుమించిన పని. మనిషి దృఢంగా, ఎర్రగా ఉండేవాడు. "అతనితో సంబంధం పెట్టుకుంటేనేం?" అనుకుంది ఆమె. అతను తమ కులంవాడు కాదు. కులం పెళ్ళికిగానీ, సరసానికి కాదు. అతనికీ ఆమె నచ్చింది. ఇద్దరికీ అవసరం తీరిపోతోంది, గుట్టుచప్పుడు కాకుండా. సుందరమ్మకు తెలుసు జరుగుతున్న భాగోతం.

"ఎక్కడికి వెళ్ళి వచ్చావే?" అని అడిగింది రంగసామితో గడిపి ఇంట్లోకి వస్తున్న కూతుర్ని.

"బాత్‌రూంకి వెళ్ళొచ్చాను" అంది కూతురు.

కామన్‌లెట్రిన్, బాత్‌రూంలు రంగస్వామి గదిపైనే ఉన్నాయి. ఆ తర్వాత తల్లి కూతుర్నేం ప్రశ్నించలేదు.

"చీకట్లో జాగ్రత్త" అని మాత్రం చెప్పింది.

అయితే, వసుధకు జీవితం మీద విసుగు కలిగింది. భర్త పిల్లలు అన్న సామాజిక నీతికి వ్యతిరేకంగా తను చరించటంవల్ల ఏదో తప్పు చేస్తున్నానన్న భావన ఆమెలో కలి గింది. ఆ తప్పుకు కారణం తన తల్లి, తానున్న పరిస్థితులు. అందుకే తల్లి అన్నా, తన పరిస్థితులన్నా ఆమెకు అసహ్యం. ఓ రోజు అంది ఆమె రంగస్వామితో "ఎప్పుడో ఓ రోజు మా అమ్మను చంపి నేను ఛస్తాను. వెధవ జీవితం విసుగేస్తోంది" అని.

నవ్వాడతను. "నాకు తెల్సు. నీకు మీ అమ్మంటే కోపమని. ఆమె మాత్రం ఏం చేస్తుంది? నువ్వు బతుకు బాగుపర్చుకునే ప్రయత్నమేం చేశావు. ఆ చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేయటం తప్పు?"

"ఏం చెయ్యమంటావ్ నన్ను?"

"నువ్వు స్కూలు చదువైనా చదివావు. నాకదికూడా గగనమైపోయింది. అందుకు నేను మా అమ్మా, నాయన్ని తప్పు పట్టను: నువ్వుపైకి చదువు. కనీసం ఆ కంప్యూటర్ కోర్సులయినా చెయ్యి. వాటిల్లో డబ్బుందని అంటున్నారు."

"ఏం పెట్టి చదవాలి?"

"కొంత నేను సాయం చేస్తాను. కొంత నువ్వు పెట్టుకో. తిట్టుకోటం, ఇతర్లను నిందిం చటం కంటే ఏమాత్రం జీవితం మెరుగు పర్చుకోటానికైనా ప్రయత్నించటం మంచిది. నేనీ ప్రయత్నమెందుకు చెయ్యలేదని నువ్వడగవచ్చు. నేను మొదటి నుంచి ప్రయత్నించాలి. ఈ నలభై రెండేళ్ళ వయసులో నేను చేయగలిగిందేం లేదు, అలవాటు పడిన జీవితం గడపటం తప్ప."

అన్నట్టే రంగస్వామి సాయం చేశాడు. తనవంతు ఖర్చుకు ఆమె జీవితం మరింత దుర్భరం చేసుకుంది. తను ఖర్చు పెట్టగలిగిన డబ్బుతో ఆమె ఓ చిన్న కంప్యూటర్ కోర్సు చేసింది. ఆ అర్హతతో ఓ కంపెనీలో ఉద్యోగముందని తెలిస్తే, ఆమె వెళ్ళి కంపెనీ యజ మానిని కలిసింది. కంపెనీ యజమాని రామప్రసాదరెడ్డి.

"మీకు అనుభవం లేదు. మిమ్మల్ని తీసుకోవటం నాకు భారమవుతుంది" అని మర్యాదగా ఆమె అభ్యర్థనను తిరస్కరించ ప్రయత్నించాడతను.

"నేను ఎవరికీ భారంకాను. ఇప్పటిదాకా పోరాటం చేస్తున్నాను. మీరు అవకాశమిచ్చి చూడండి" అంది ఆమె.

పోరాటం అతనికి పరిచయమైందే. ఆమె అలా అనగానే అతను ఆమె వంక తేరిపార చూశాడు.

ఓ నిశ్చయానికొచ్చినట్టు, "మీకు చిట్‌ఫండ్ కంపెనీలో ఎంతిస్తున్నారు?" అని అడిగాడు.

చెప్పింది వసుధ.

"అంతకంటే ఒక్కపైస మీకు ఎక్కువ ఇవ్వను. ఇష్టమైతే చేరండి. మీ పని నచ్చనప్పుడు నిర్దాక్షిణ్యంగా పంపేస్తాను. ఆ చిట్‌ఫండ్ కంపెనీలో ఉద్యోగానికి రిజైను చేస్తారు కనుక మీరు వీధిలో పడే అవకాశం ఉంది."

"ఇష్టమే. రిస్క్ లేక జీవితం లేదు."

ఆ విషయం రంగస్వామికి చెప్పినప్పుడు అతను సంతోషించాడు. ఆ పైన చెప్పాడు: "నేను మా ఊరు వెళ్ళిపోతున్నాను. మా ఆవిడకు కాన్సరు. నయమవుతుందో లేదో చెప్ప లేను. మళ్ళీ ఇక్కడికి వస్తానో లేదో కూడా తెలియదు. నువ్వు సుఖంగా ఉండాలని కోరుకుంటున్నాను."

"అయ్యో!" అంది వసుధ విచారాన్ని వ్యక్తం చేస్తూ.

"చేతిలో లేని దానికి బాధపడి ప్రయోజనం లేదు. మనమంతా వీరులైన సైనికులం. ఈ బతుకు బతకటానికి ఎంత ధైర్యముండాలి?" అని నవ్వాడతను.

వసుధను అంచనా వేయటంలో రామప్రసాదరెడ్డి పొరపాటు పడలేదు. చదువు తక్కువయినా పనిలో మంచి చాకచక్యం చూపించగలదని అతనికి అర్థమైంది. ఆపైన ఆమె పట్ల అభిమానం కూడా పెంచుకున్నాడతను. ఆమె జీతం కూడా పెంచాలను కున్నాడు. అతను జీవితంలో ఆలస్యంగా పెళ్ళి చేసుకున్నాడు. అది పొరపొచ్చాల కాపురమే అయింది. భార్యాభర్తా చిన్నచిన్న విషయాలకే తగవులాడుకోసాగారు.

"మనకు పడటం లేదు. ఇద్దరం కల్సి విడాకులకు అప్లయిచేస్తే తొందరగా మంజూ రవుతుంది" అన్నాడతను.

"నేను నీకు విడాకులివ్వను. నువ్వెలా మళ్ళీ పెళ్ళి చేసుకుంటావో చూస్తాను" అని పంతంపట్టి ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది.

అతను విడాకులకు కోర్టులో అర్జీ దాఖలు చేశాడు. ఐదేళ్ళ నుండి కోర్టులో కేసు నడుస్తోంది. అది త్వరగా తీర్పయ్యేట్టు కన్పించలేదనికి. వసుధ అతని కంపెనీలో చేరిన ఆరు నెలలకతనో ప్రతిపాదన చేశాడు. తన గృహస్థ జీవితం గురించి వివరంగా చెప్పి: "మీ కిష్టమైతే కలిసి ఉండొచ్చు. లీగల్‌గా పెళ్ళి చేసుకోటానికి ప్రస్తుతానికి కుదరదు. కోర్టు మాకు విడాకులు మంజూరుచేస్తేనే అది సాధ్యమవుతుంది. అప్పటిదాకా నీకు నా మీద నమ్మకముందనుకుంటే మనం కలిసి బతకొచ్చు. ఆర్థికంగా మీకెలాంటి ఇబ్బందీ కలగకుండా నేను చూసుకుంటాను. మీకు నా ప్రపోజల్ ఇష్టం లేకపోయినా మీరిక్కడ ఉద్యోగం మానెయ్యాల్సిన పనిలేదు. మనం ఏం జరగనట్టే మసలుకుందాం."

"నేను ఆలోచించుకోవాలి" అంది వసుధ.

"ఓ, ష్యూర్, టేక్ యువర్ ఓన్ టైం."

అది జరిగి నెలరోజులయింది. అతను మళ్ళీ ఆ ప్రస్తావన చెయ్యలేదు. ఆమె ఎటూ తేల్చుకోలేకపోయింది. కులం సంగతి ఆమె పట్టించుకోటం ఎప్పుడో మానేసింది. రంగ స్వామి సంబంధంలో బంధనం లేదు ఆమెకి. ఇక్కడ అలా కాదు. ఓ బంధనం ఏర్పడు తుంది. అయితే ఆర్థిక స్థిరత్వం కూడా కలుగుతుంది. కానీ, మొగనాడిని ఎంతకాలం సహ్యవచ్చో ఆమె తేల్చుకోలేకపోయింది.

ఆఫీసు నుండి ఇంటికొచ్చి తల్లిని స్టీలు బిందె కొన్నందుకు విసుక్కున్నాక ఆమెకు తన జీవితంలోని నిరర్థకత్వం గోచరించింది. దేనికోసం తన సుఖాన్ని, తల్లి సంతోషాన్ని తను త్యాగం చేస్తున్నది? ఈ నిరర్థకమైన తల్లి త్యాగం వయస్సు యాభై దాటిపోయింది. ఇంకెన్నేళ్ళు? దారిద్ర్యం తనలో సమాజంపట్ల కోపాన్ని పెంచుతోంది. బాల్కనీలో చలికి ముడుచుకు కూర్చున్న తల్లిని చూసిన వసుధకు మనసు ద్రవించిపోయింది. ఆమె నిశ్చయం చేసుకుంది. అప్పటిదాకా తాను కూర్చున్న తల్లి మిషను స్టూలు మీద నుండి లేచి చెప్పులేసుకుంటూ, "అమ్మా మొహం కడుక్కుని తయారవ్వు. ఓ అరగంటలో బయట కెళ్దాం. ఏ హోటల్లోనో భోజనం చేసివద్దాం ఇంటికి" అంది.

సుందరమ్మ అర్థం కానట్టు కూతురి వంక చూసింది.

"చెప్పింది అర్థం కాలా? లే. మనం బయటికెళ్తున్నాం" అంది కసుర్తున్నట్టు.

వసుధ వీధిలోకి వచ్చి, సందుమలుపులో ఉన్న టెలిఫోను బూత్‌నుండి రామ ప్రసాదుకు ఫోను చేసింది.

"మీ ప్రపోజల్‌కి నేను అంగీకరిస్తున్నాను. ఉండ్‌లాండ్స్‌లో భోంచేద్దాం. మా అమ్మకూడా వస్తున్నది. ఎనిమిదింటికల్లా అక్కడికి వచ్చేయండి. ఈ లోపల డ్రైవరు చేత నాకో రెండు వేలు పంపించండి" అని.

ఓ పావు గంటలో రామప్రసాదరెడ్డి డ్రైవరు వచ్చి ఆమెకు రెండు వేల రూపాయలు ఇచ్చాడు. తల్లీ, కూతురు ఆటోలో ఆబిడ్స్‌కు వెళ్ళారు. చల్లటి గాలికి సుందరమ్మ తన కృశించిన శరీరం చుట్టూ పమిట కప్పుకుని ముడుచుకు కూర్చుంది. అబిడ్స్‌లో షాల్స్ అమ్మే షాపుకు వెళ్ళారు వాళ్ళు. సుందరమ్మ అంతా విచిత్రంగా చూస్తోంది. షాపులో వెలుగుతున్న విద్యుద్దీపాలు ఆమె కళ్ళలో మెరుపులు మెరిపించాయి.

సేల్స్‌మన్ షాల్స్ చూపించసాగాడు. అవి మూడొందలు, నాలుగు వందల రేంజ్‌లో ఉన్నాయి.

"ఇదెలా ఉంది?" అందో పసుపుపచ్చని శాలువా తల్లికి చూపిస్తూ వసుధ.

"బావుంది" అంది సుందరమ్మ. అయితే ఆమె దృష్టిని పక్కనే నిలబడి ఓ యువజంట ఓ తెల్లటి శాలువాను చూస్తుండటంపైనే లగ్నమై ఉంది.

సేల్స్‌మన్ ఆమె దృష్టిని అనుసరించి చూస్తూ "అది మంచి క్వాలిటీది. అయితే ధర ఎక్కువ" అన్నాడు.

"ఎంత!" అడిగింది వసుధ.

"పన్నెండు వందలు" అన్నాడు సేల్స్‌మన్.

"అదివ్వండి" అంది వసుధ.

శాలువా పాక్ చేయించలేదు ఆమె. పన్నెండొందలూ కౌంటర్‌లో పే చేసి, మడత విప్పి తల్లి భుజాల చుట్టూ కప్పింది వసుధ. "ఇంత డబ్బు!" గొణిగింది సుందరమ్మ. కూతురి ఎదుట మాట్లాడటమే భయంగా ఉంటోంది ఆమెకీ మధ్య.

"డబ్బు గురించి మనం ఇంక పట్టించుకోవాల్సిన పని లేదు" అంది వసుధ.

ఆటోలో ఇద్దరూ ఉడ్‌లాండ్స్‌కి వెళ్ళారు. అక్కడ రామ్‌ప్రసాద్ వాళ్ళకోసం నిరీక్షిస్తున్నాడు. తల్లిని అతనికి పరిచయం చేసింది వసుధ. "వీరు మా కంపెనీ యజమాని. పేరు రామప్రసాద్‌రెడ్డి" అని తల్లికి చెప్పిందామె. అతని కులం పేరును నొక్కి చెప్తూ.

అతను ఆమెకు నమస్కారం చెప్పాడు. సుందరమ్మ అతని వంక తేరిపార చూసింది. ఎర్రటి మనిషి, ఒడ్డూ పొడుగూ, పక్కపాపిడి జుట్టు. నవ్వే కళ్ళు, రిమ్‌లెస్ కళ్ళద్దాలు. పాంటులో ఫుల్‌హాండ్ షర్ట్ టక్ చేశాడు. పైన కోటు, టై- బాగానే ఉన్నాడనిపించింది ఆమెకు. ఆ 'బాగు'లో డబ్బు వాసన వేసింది. అసంకల్పితంగానే ఆమె కూతురి వంక చూసింది. ముప్పయ్యేళ్ళు దాటుతున్న కూతురిలో కళ చెడలేదు అనుకుంది ఆమె. సిగ్గుపడ్తూ అతనికి అభివాదం చేసింది.

హోటలు డైనింగ్ హాలులోకి వెళ్ళారు. రకరకాలయిన పదార్థాలను అతడు ఆర్డరు చేశాడు. భోజనం చేస్తున్నంత సేపూ అతను వసుధతో ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. చివరగా కాఫీ అర్డరు చేశాడతను.

"వద్దు. భోజనమయ్యాక కాఫీ ఎందుకూ?" అంది సుందరమ్మ.

"బాగుంటుంది. తాగి చూడండి" అన్నాడతను.

కారులో వాళ్ళను ఇంటి దగ్గర డ్రాప్ చేశాడతను.

పడుకోబోతూ అంది వసుధ తల్లితో: "మనం వారం రోజుల్లో ఇల్లు మారుతున్నాం. అక్కడ కింద నుంచీ నీళ్ళు తెచ్చుకోవాల్సిన ఇబ్బంది ఉండదు. చీరెలేసి స్టీలు బిందెలు కొనాల్సిన పని లేదు..." ఆమెకు తల్లితో ఎంతో మాట్లాడాలని ఉంది. కానీ మాట్లాడలేకపోయింది.

ఎప్పటిలా నేలమీద బొంత పరుచుకుంది సుందరమ్మ. శాలువాను దుప్పటికి జతచేసి కప్పుకుంది. వెచ్చగా ఉంది. వెచ్చదనంలో సుఖం ఉంది. సుఖంలో అందముంది. ఇప్పుడామెను స్టీలు బిందె ఆకర్షించటం లేదు. బంగారమా, వెండా? ఒట్టి ఇనుం. కనిష్ట లోహం. 'కూతురు అతన్ని పెళ్ళి చేసుకుంటుందా?' అడిగే ధైర్యం లేదు.

వసుధ ఒంటరిపోరాటంతో విసిగిపోయింది. అందుకే భవిష్యత్తును కుదువబెట్టదానికి నిశ్చయించుకుందామె. వస్తు మార్పిడి లోకంలో ఏదీ ఊరికే లభిస్తుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. త్యజించడానికి జాత్యహంకారం లేదెప్పుడూ. వైవాహిక బంధనంలో భద్రతేదో ఉన్నదన్న సంప్రదాయ భావన ఆమెని వేధించింది ఇంతకాలమూ. అది త్యజించేసిందామె. 'దారిద్ర్యం మనిషి మనసు కుదింప చేస్తుంది. ప్రపంచాన్ని అసహ్యించుకునేట్టు చేస్తుంది' అని తెలుసుకుందామె. తల్లి వెచ్చగా పడుకుంటే తృప్తిగా నిట్టూర్చింది ఆమె వంక చూసి వసుధ.

దారిద్ర్యం మనుషుల్ని వివశుల్ని చేస్తుంది.

'ప్రజాశక్తి' ఆదివారం, 18 నవంబర్ 2001.